సాక్షి
కర్నూలు
బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



అలరించిన నృత్యాలు

శ్రీశైలం టెంపుల్: నిత్య కళారాధన వేదికపై నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. భక్తి గీతాలకు పలువురు కళాకారులు నృత్యాలు చేశారు.



సంగమేశ్వరం ముస్తాబు

కొత్తపల్లి: సంగమేశ్వరం ఆలయం శివరాత్రి వేడుకులకు ముస్తాబవుతోంది. ఆలయ ఈఓ మోహన్ పర్యవేక్షణలో చలువ పందిళ్లు, క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,611.56
టీఎంసీల సామర్థ్యం	:105,788
ప్రస్తుతం	:40,742
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,384

న్యూస్‌రీల్

దామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివి

- నివాళి అర్పించిన కలెక్టర్, జేసీలు



సంజీవయ్య చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివని కలెక్టర్ పి.కోటేశ్వరరావు కొనియాడారు. దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా పని చేశారని, ఆయన జిల్లా వాసి కావడం ఎంతో గర్వకారణమన్నారు. మంగళవారం దమోదరం సంజీవయ్య జయంతిని అధికారికంగా నిర్వహించారు. కాగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఆర్భాటంగా కాకుండా సద్భావ వాతావరణంలో కలెక్టరేట్‌లోని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎస్.ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, ఏఓ వెంకటేష్ పాల్గొన్నారు.

హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హఫీజ్ మంజూర్ అహ్మద్

కర్నూలు(రాజ్‌విహార్): హజ్ యాత్రకు వెళ్లేందుకు ముస్లింలు దరఖాస్తు చేసుకోవాలని హజ్ కమిటీ రాష్ట్ర సభ్యుడు హఫీజ్ మంజూర్ అహ్మద్ సూచించారు. మంగళవారం బుధవార పేటలో ఉన్న మహబూబ్ సుబహాని మసీదులోని రాయలసీమ హజ్ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హజ్ యాత్ర-2023కు సౌదీ అరేబియా దేశం అనుమతులు జారీ చేయడంతో కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసిందన్నారు. 2023 ఏప్రిల్ 30లోపు 70 ఏళ్లు దాటే వారికి డిప్ పద్ధతి కాకుండా నేరుగా ఎంపిక చేయడంతో పాటు వారి వెంట మరొకరికి అవకాశం కలిప్తారన్నారు. రాయలసీమ హజ్ సొసైటీ అధ్యక్షుడు హాజీ మహమ్మద్ పాషా మాట్లాడుతూ పాస్ పోర్టు కలిగిన వారు అర్హులని, వీరికి తమ వంతు ఉచిత సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9440232564, 9908545232, 9963318255 నంబర్లకు సంప్రదించాలన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు హాజీ ఎం.బాషా సాబ్, హాజీ నూరుల్లా, హాజీ షేక్ సలాం పాల్గొన్నారు.

ఆహార లైసెన్స్ జారీలో మార్పులు

కర్నూలు(హాస్పిటల్): ఆహార నియంత్రణ విభాగం జారీ చేసే ఆహార లైసెన్స్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు తీసుకొచ్చింది. గతంలో లైసెన్స్, లైసెన్స్ రెన్యువల్‌కు ఆన్‌లైన్‌లో ఒకేసారి రూ.2 వేలు చెల్లిస్తే పని అయిపోయేది. కానీ ఇప్పుడు ఆ పద్ధతిని మార్చారు. ముందుగా లైసెన్స్ కోసం రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత సదరు వ్యాపారానికి సంబంధించిన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు అందజేయాలి. అన్నీ సరిగ్గా ఉంటేనే అతని లైసెన్స్ వస్తుంది. ఈ ప్రక్రియలో ఉత్తీర్ణత సాధిస్తే మరో రూ.1,000లు చెల్లిస్తే లైసెన్స్ జారీ అవుతుంది. అయితే డాక్యుమెంట్స్ సరిగ్గా ఇవ్వని పక్షంలో అతని లైసెన్స్ జారీ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోతుంది. దీంతో మళ్లీ మరో రూ.1000లు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మానాయకులు చెప్పారు.

నేడు ఎథిక్స్, హ్యూమన్ వాల్యూస్ పరీక్ష

నంద్యాల(సిటీ): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇంటర్ మొదటి ఏడాది జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు బుధవారం ఎథిక్స్, హ్యూమన్ వాల్యూస్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐఓ గురువయ్యశెట్టి మంగళవారం తెలిపారు. ఈ పరీక్షలకు 32,797 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులు పరీక్షలకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల డ్యామ్‌కు మంగళవారం 1,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉందని, కేసీ కాల్వకు 1,058 క్యూ సెక్కులు విడుదల చేశామన్నారు.

పుంజుకున్న ఆదాయం!

మార్కెట్‌లో పెరటికోళ్లకు డిమాండ్

- పెంపకాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- స్వయం సహాయక సంఘాల మహిళలకు తక్కువ ధరతో పంపిణీ
- నాటుకోడి మాంసం, గుడ్లకు మంచి ధర
- ప్రకృతి వాతావరణంలో పెరగటమే కారణం

ఆదివారం వస్తే చాలు కోళ్లకు విపరీతమైన డిమాండ్ ఉంటోంది. విధిలేని పరిస్థితుల్లో బ్రాయిలర్ మాంసం కొంటున్నా.. నాటుకోళ్లు కనిపిస్తే ధరకు వెనుకాడకుండా కొనుగోలు చేస్తున్నారు. వీటి మాంసానికే కాదు, గుడ్లకు కూడా మంచి ధర లభిస్తోంది. సహజసిద్ధంగా పెరగడంతో పాటు రోగనిరోధక శక్తి పెరిగేందుకు అవసరమైన పోషకాలు ఉండటంతో ప్రతి ఒక్కరూ ఈ మాంసాన్ని ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కూడా సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు నాటు కోళ్లు సరఫరా చేసి పెరటికోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది.

కర్నూలు(అగ్రికల్చర్): తమిళనాడులోని సేలం నాటు కోళ్లకు పెట్టింది పేరు. పొదుపు మహిళల జీవనోపాధి మెరుగు పరిచేందుకు ప్రభుత్వం డీఆర్‌డీఏ-వైకేపీ ద్వారా నాటు కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో బాలింతలు, గర్భిణీ స్త్రీలు, రెండేళ్లలోపు చిన్నారులు రక్తహీనత, పోషకాహార లోపం, రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇతర ఆదాయ మార్గాలు కూడా లేని పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంథ్యంలో పెరటి కోళ్ల పెంపకం మహిళలకు ఎంతో ఊరటనిస్తోంది. ఆహారంలో నాటు కోడి గుడ్లను తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యల నుంచి బయటపడే అవకాశం ఏర్పడింది. ఇదే సమయంలో గుడ్లు, కోళ్ల విక్రయం ద్వారా ఆర్థిక తోడ్పాటు లభిస్తోంది.

5వేల నాటుకోళ్ల యూనిట్ల పంపిణీ

- ➡ డీఆర్‌డీఏ-వైకేపీ స్వయం సహాయక సంఘాల మహిళలకు తక్కువ ధరతో నాటు కోళ్లు సరఫరా.
- ➡ 2022-23 సంవత్సరంలో జిల్లాలో 5వేల యూనిట్ల పంపిణీకి ప్రణాళిక.



- ➡ యూనిట్‌లో 8 పెట్టలు, 3 పుంజులు.
- ➡ మూడు నెలల వయస్సు, కిలో బరువు కలిగిన కోళ్లు పంపిణీ.
- ➡ కోళ్లతో పాటు నట్టల నివారణ మందు, బరువు పెరగడానికి విటమిన్‌లు, రోగాలు దరి చేరకుండా యాంటిబయాటిక్ మందులు అందజేత.
- ➡ కార్డ్‌బోర్డ్ బాక్స్‌లో కోళ్ల పంపిణీ.
- ➡ యూనిట్ కాస్ట్ రూ.3150. సబ్సిడీ ఉండదు.
- ➡ పెరటి కోళ్ల పెంపకంపై ఆసక్తి ఉంటే ఒక్కరికే రెండు, మూడు యూనిట్లు కూడా ఇస్తారు.

ఆరవ నెల నుంచి గుడ్ల ఉత్పత్తి

నాటు కోళ్లు ఏడాదికి 150 వరకు గుడ్లు పెడుతాయి. ఆరవ నెల నుంచి గుడ్లు పెట్టడం మొదలవుతుంది. వీటిని పొదిగిస్తే 21 రోజుల్లో పిల్లలు బయటికొస్తాయి. గ్రుడ్లను పొదిగించి పిల్లలను ఉత్పత్తి చేసుకొని నాటు కోళ్ల పెంపకాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చు. మార్కెట్‌లో లేయర్ కోడి గుడ్డు ధర రూ.5 వరకు ఉండగా.. నాటుకోడి గుడ్డు ధర రూ.10 వరకు నడుస్తోంది. అంటే ఒక కోడి ఏడాదికి గుడ్ల ద్వారా రూ.1,500 ఆదాయాన్ని ఇస్తుంది. ఒక యూనిట్‌లో 8 పెట్టలు ఉంటాయి. వీటి నుంచి గుడ్ల ద్వారా ఏడాదికి రూ.12వేలు వరకు లబ్ధి పొందవచ్చు.



పుంజులకు భలే డిమాండ్

నాలుగు నెలల క్రితం పంపిణీ చేసిన యూనిట్లలో పుంజులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మాంసం కోసం ఒక పుంజును రూ.1,300 అడుగుతున్నారంటే డిమాండ్ ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. యూనిట్ పంపిణీ చేసిన నాలుగైదు నెలల్లోనే పుంజుల ద్వారా రూ.3,600 వరకు పొందే అవకాశం ఏర్పడింది. నాటు కోళ్లు కెమికల్స్ లేకుండా పెరుగుతాయి. ప్రత్యేకంగా దాణా ఇవ్వాల్సిన అవసరం లేదు.



లేయర్ కోడి గుడ్లు ఇలా..	నాటుకోడి గుడ్లు ఇలా..
● పూర్తి వైట్	● లైట్ బ్రౌన్ కలర్

పుంజు ధర రూ.1300 పలుకుతోంది



డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు నాలుగు నెలల క్రితం 8 నాటు కోడిపెట్టలు, 3 పుంజులు ఇచ్చారు. వీటికి రూ.3,150 చెల్లించాం. పెంపకానికి ప్రత్యేకంగా పెట్టుబడి అంటూ లేదు. ఇచ్చేటప్పుడు ఒక్కొక్కటి కిలో బరువు ఉన్నాయి. ఇప్పుడు ఒక్కో పుంజును రూ.1,300 ధరతో కొంటామని వస్తున్నారు. గుడ్లు పెట్టడం మొదలయింది. రోగనిరోధక శక్తి పెరుగుతుందని వీటిని పిల్లలకు ఇస్తున్నాం. గుడ్ల ధర రూ.10 వరకు ఉంటోంది. పెరటికోళ్ల పెంపకం బాగా కలసి వస్తోంది.

– నరసమ్మ, పెసలబండ, ఆదోని మండలం

జీవనోపాధి మెరుగు



పెరటికోళ్ల పెంపకంతో స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధి మెరుగవుతుంది. తమిళనాడులోని సేలం నుంచి పూర్తి నాటు కోళ్లను తెప్పించి పంపిణీ చేస్తున్నాం. జిల్లాలో 5వేల యూనిట్లు పంపిణీ చేయాలనే లక్ష్యంగా ఎంచుకున్నాం. ఇప్పటి వరకు 2,064 యూనిట్ల కోళ్లు పంపిణీ చేశాం. మార్చిలోపు లక్ష్యం పూర్తవుతుంది.

– వెంకటసుబ్బయ్య, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ-వైకేపీ

భక్తులకు రక్షణ కల్పించడమే లక్ష్యం



టూరిస్ట్ పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పీఠాధిపతి సుభుధేంద్రతీర్థులు, ఎస్పీ సిద్ధార్థకౌశల్

- ఎస్పీ సిద్ధార్థకౌశల్

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు మంత్రాలయం వచ్చే భక్తులకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం టూరిస్ట్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిందని జిల్లా ఎస్పీ సిద్ధార్థకౌశల్ అన్నారు. మంగళవారం శ్రీ మఠం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్ స్టేషన్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించగా జిల్లా ఎస్పీ సిద్ధార్థకౌశల్ శిలాఫలకాన్ని, టూరిస్ట్ పోలీస్‌స్టేషన్ బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు టూరిస్ట్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి శ్రీ రాఘవేంద్ర స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసు శాఖకు శ్రీ మఠం తరపున పూర్తి సహాయసహకారాలు అందిస్తామన్నారు. ఎస్పీతో కలిసి మఠంలో జరిగే అభివృద్ధి పనులు, జరగాల్సిన పనులను పరిశీలించి చర్చించారు. ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి మధ్వమార్గ్‌ను తిలకించారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్, ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు వేణుగోపాల్ రాజు, కిరణ్, వెంకటేశ్వర్లు, శ్రీ మఠం మేనేజర్ ఎస్.కే.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముక్కంటికి భక్త కోటి నీరాజనం

- శ్రీగిరిలో మారుమోగుతున్న శివనామస్మరణ
- మిన్నంటిన బ్రహ్మోత్సవ సంబరాలు



మయూరవాహనంపై విహరిస్తున్న స్వామిఅమ్మవార్లు. (ఇన్‌సెట్‌లో)టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న టీటీడీ చైర్మన్ సతీమణి స్వర్ణలతరెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాల్గవరోజు మంగళవారం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జునుడు మయూర వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయ ప్రదక్షిణ అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు పూజలు చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. గ్రామోత్సవం ముందు కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషధారణలో కళాకారులు, జాంజ్ పథక్, గొరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, తప్పెట్లు, డ్రమ్స్, భజంత్రీలు, భంజార నృత్యాలు, శంఖానాదాలు మార్మోగాయి. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం, గంగాధర మండపం మీదుగా నందిమండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు సాగింది. మయూర వాహనంపై దర్శనమిచ్చిన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను భక్తులు కనులారా దర్శించుకున్నారు.

కాణిపాకం, టీటీడీ తరుపున పట్టువస్త్రాల సమర్పణ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరుపున ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఎ.మోహన్ రెడ్డి, ఈఓ ఎ.వెంకటేష్ స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం తరుపున శ్రీస్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. టీటీడీ చైర్మన్ సతీమణి స్వర్ణలత, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం పట్టువస్త్రాలు తీసుకురాగా శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్, ఈవో, సభ్యులు, అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ రాజగోపురం వద్ద ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. తదుపరి స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

- డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య



పొదుపు మహిళలతో మాట్లాడుతున్న పీడీ వెంకటసుబ్బయ్య

తుగ్గలి: బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకుని మహిళా సంఘాలు మరింత ఆర్థిక పరిపుష్టి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కేపీ గుడిసెలలో ఆయన స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. సంఘాల పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. జీవనోపాధులపై అడిగి తెలుసుకున్నారు. పొదుపు సంఘాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పీడీ వివరించారు. మహిళల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. మహిళా సంఘాలు మరింత ఆర్థిక ప్రగతి సాధించేందుకు స్త్రీనిధి, ఉన్నతి కింద రుణాలు అందిస్తున్నామన్నారు. గ్రామంలో అంతా ఎస్టీలు ఉండడంతో ఉన్నతి కింద తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామని వాటితో ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో వైకేపీ ఏపీఎం రాధాకృష్ణ, సీసీలు రవికుమార్, శేఖర్, ఆచారి, హెచ్‌డీ సీసీ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతగా నిర్వహించండి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జేసీ రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలను నిబంధనల మేరకు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలను ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 16 నుంచి నామినేషన్ల స్వీకరరణ ఉంటుందన్నారు. ఫామ్-1కి సంబంధించి నోటీసులను జిల్లా, మండల కార్యాలయాలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ల విత్‌డ్రాకు ఎన్నికల చట్టం ప్రకారం రెండు, నాలుగు శనివారాలతో పాటు మహాశివరాత్రిని సెలవు రోజులుగా పరిగణిస్తున్నట్లు చెప్పారు. నామినేషన్ వేసే అభ్యర్థి రాష్ట్రంలో ఎక్కడైనా ఓటు హక్కును కలిగి ఉండాలని, అందుకు సంబంధించి ఓటర్ ప్రూఫ్‌ను జతపరచాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియను తప్పకుండా రిటర్నింగ్ అధికారి మాత్రమే చేయాలన్నారు. ఎంసీఎంసీ బృందాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ నుంచి కౌంటింగ్ వరకు వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఎస్ రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్య అన్నదానానికి రూ.2లక్షలు విరాళం

మంత్రాలయం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి నిత్య అన్నదానానికి బెంగళూరుకు చెందిన పరిమళ, పి.రావు దంపతులు రూ.2 లక్షలు విరాళంగా అందజేసినట్లు మఠం మేనేజర్ ఎస్.కె. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం దాత దంపతులు మంత్రాలయంలో గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని పూజలు చేసుకున్నారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూలబృందావనికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. దంపతులను స్వామివారి శేషవస్త్రాలతో సన్మానం చేసి ఫల, పుష్పమంత్రాక్షితలు అందజేశారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): స్థానిక జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు బుధవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి- శిశు సంక్షేమం, ఆర్థిక, ప్రణాళిక, పనులకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. స్థాయీ సంఘాల చైర్‌పర్సన్లు, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని సీఈఓ కోరారు.

క్లుప్తంగా

బ్యాంకింగ్ వ్యవహారాలపై అవగాహన అవసరం



వారోత్సవాలపై ఆర్‌బీఐ విడుదల చేసిన లోగో

కర్నూలు(అగ్రికల్చర్): సురక్షిత బ్యాంకింగ్ వ్యవహారాలపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఈ నెల 13 నుంచి 17 వరకు ఆర్థిక అక్షరాస్యత (ఫైనాన్సియల్ లిటరసీ)వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2016 నుంచి ఏటా ఫైనాన్సియల్ లిటరసీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది మంచి ఆర్థిక ప్రవర్తన– మీకు రక్ష (గుడ్ ఫైనాన్సియల్ బిహేవియర్–యువర్ సేవర్) నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. నగదు ప్రమేయం లేని డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించే దిశగా ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటోందన్నారు. డిజిటల్ లావాదేవీలకు, బ్యాంకు ఖాతాదారులకు రక్షణ కల్పించాలనేది ప్రధాన ఉద్దేశమన్నారు. డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ భద్రత, అక్రమ లావాదేవీల ద్వారా కలుగబోయే నష్టాలను నివారించడం, కార్డు లావాదేవీలకు పరిమితులు నిర్ణయించుకోవడం, దగాకోరు ఈమెయిల్స్, ఎస్‌ఎంఎస్ పట్ల జాగ్రత్తలు వహించడం, డిజిటల్ బ్యాంకింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారోత్సవాల్లో వివరించనున్నట్లు చెప్పారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆదోని రూరల్: మండలంలోని బల్లేకల్ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం రెండు స్కూటర్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దతుంబళం ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలు.. బల్లేకల్ గ్రామానికి చెందిన బోయ లక్ష్మయ్య(45) గణేకల్ నుంచి బల్లేకల్‌కు స్కూటర్‌పై వెళ్తుండగా పెద్దతుంబళం గ్రామానికి చెందిన ఈడిగ వీరేష్(30) ద్విచక్ర వాహనంపై వెనుక నుంచి వేగంగా వస్తూ ఢీకొట్టాడు. ప్రమాదంలో ఇద్దరూ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న వారు క్షతగాత్రులను ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం బోయ లక్ష్మయ్యను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి, ఈడిగ వీరేష్‌ను పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్ఠం(రూ)	గరిష్ఠం (రూ)
వేరుశనగ	3,721	8,100
ప్రొద్దుతిరుగుడు	4,219	5.210
ఆముదం	5,319	6,529
ఉల్లి	309	990
ఎండు మిర్చి	5,580	32,199
శనగలు	2,789	4,589
కందులు	3,600	7,474
మొక్కజొన్న	2,146	2,146
మినుములు	6,829	7,109
వాము	6,200	24,590



ఫైనల్స్‌కు చేరిన తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల జట్టు



జూనియర్ విభాగంలో ఫైనల్స్‌కు చేరిన తిరుపతి సీకామ్ జూనియర్ కళాశాల జట్టు



ఫైనల్స్‌కు చేరిన ప్రొద్దుటూరు ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల జట్టు

హోరాహోరీగా 'ఎస్పీఎల్'

- రీజనల్ స్థాయిలో తలపడిన అనంత, వైఎస్సార్ : తిరుపతి, కర్నూలు, నంద్యాల జట్లు
- సీనియర్ విభాగంలో ఫైనల్స్‌కు చేరిన తిరుపతి, కడప జట్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో 'సాక్షి ప్రీమియర్ లీగ్' (ఎస్పీఎల్) రీజనల్ స్థాయి క్రికెట్ పోటీలు తొలి రోజు హోరాహోరీగా సాగాయి. అనంతపురం జిల్లాతో పాటు వైఎస్సార్, తిరుపతి, కర్నూలు, నంద్యాల జట్లు రీజనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించగా... అనంత క్రీడాగ్రామం వేదికగా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సీనియర్ విభాగంలో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఆర్ట్స్ కళాశాల (అనంతపురం) జరిగిన తొలి మ్యాచ్‌ను 'సాక్షి' అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్తమాన క్రీడాకారులకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. క్రీడల్లో ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించేవారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. మానసిక, శారీరక వికాసంతో పాటు క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు సులువుగా దక్కించుకోవచ్చన్నారు. కృషి, పట్టుదల, అంకితభావం, సాధన ఉంటే ఎలాంటి క్రీడలోనైనా రాణించవచ్చునన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకున్నప్పుడే క్రీడాకారుడికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో 'సాక్షి' ఏడీవీటీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, ఈవెంట్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల వివరాలు ఇలా..

☛ అనంత క్రీడాగ్రామంలోని హాకీ క్రీడామైదానం వేదికగా జరిగిన సీనియర్ విభాగం తొలి మ్యాచ్‌లో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఆర్ట్స్ కళాశాల అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆర్ట్స్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు నిర్ణీత పది ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 110 పరుగులు సాధించింది. జట్టులో లేఖజ్ 18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో బ్యాటర్ శశాంక్ 14 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 29 పరుగులు సాధించాడు. అనంతపురం బౌలర్లలో వినయ్ 3, భార్గవ్ 2 వికెట్లు దక్కించుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన అనంతపురం జట్టు నిర్ణీత పది ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 84 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో భార్గవ్ 14 బంతుల్లో 2 సిక్సర్లతో 22 పరుగులు, వినయ్ 14 బంతుల్లో 1 సిక్సర్, 1 ఫోర్‌తో 19 పరుగులు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. తిరుపతి బౌలర్ కార్తీక్ 1 వికెట్ సాధించాడు. 26 పరుగులతో తిరుపతి జట్టు విజయం సాధించింది.



టాస్ వేసి అనంతపురం-తిరుపతి జట్ల మధ్య మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న 'సాక్షి' అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్

☛ సీనియర్ విభాగంలో జరిగిన రెండో మ్యాచ్‌లో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల, కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ప్రొద్దుటూరు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 79 పరుగులు చేసింది. జట్టులో వెంకటేష్ 20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30 పరుగులు సాధించాడు. కర్నూలు బౌలర్లలో లోకేష్ 3, హరి 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 75 పరుగులకే పరిమితమైంది. జట్టులో జావీద్31 బంతుల్లో 2 సిక్సర్లు, 3 ఫోర్లతో 51 పరుగులతో అజేయంగా నిలిచాడు. కడప బౌలర్లలో సాయి సుధీర్ 1 వికెట్ సాధించారు. 4 పరుగుల తేడాతో ప్రొద్దుటూరు జట్టు విజయం సాధించింది.

జూనియర్ విభాగంలో చెలరేగిన తిరుపతి బ్యాటర్లు

జూనియర్ విభాగంలో అనంతపురం జిల్లా నుంచి ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టుతో పాటు వైఎస్సార్ జిల్లా కడపలోని శ్రీసాయి ఐటీఐ కళాశాల, తిరుపతిలోని సీకామ్ జూనియర్ కళాశాల, నంద్యాలలోని ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల జట్లు రీజనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించాయి.

☛ తొలి మ్యాచ్‌ను సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి), ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల (నంద్యాల)జట్ల మధ్య నిర్వహించారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నంద్యాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసింది. జట్టులో అనిల్ 21 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 28 పరుగులు సాధించాడు. తిరుపతి బౌలర్లలో ధనుష్, జబిన్ చెరో వికెట్ కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు కేవలం 5.4 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో భరత్ 15 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో 29 పరుగులు సాధించాడు. నంద్యాల బౌలర్లలో గోవర్ధన్ 1 వికెట్ కూలదోశాడు. 8 వికెట్లతో తిరుపతి జట్టు భారీ విజయాన్ని నమోదు చేసి, ఫైనల్స్‌కు చేరుకుంది.

☛ బుధవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల – ఆత్మకూరు (అనంతపురం), శ్రీసాయి ఐటీఐ కళాశాల – కడప (వైఎస్సార్) జట్ల మధ్య నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుతో తిరుపతి సీకాం జట్టు తలపడనుంది.

☛ నేడు సీనియర్ విభాగంలో ఫైనల్స్

సీనియర్ విభాగంలో ఫైనల్ మ్యాచ్‌ను సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు – వైఎస్సార్ జిల్లా) మధ్య బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు.

ఆర్థికంగా దెబ్బతీస్తున్నాడని అంతమొందించారు



హత్య కేసు నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

- మిస్టరీ వీడిన లద్దగిరి శ్రీనివాసులు హత్య కేసు
- ఏడుగురు నిందితుల అరెస్టు

డోన్ రూరల్: ఈనెల 8న ప్యాపిలి మండలం బావిపల్లి గ్రామం వద్ద జరిగిన లద్దగిరి శ్రీనివాసులు హత్య కేసు మిస్టరీ వీడింది. తనను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాడనే కారణంతో కొచ్చెర్వు జనార్దన్‌నాయుడు మరో ఆరుగురితో కలిసి అంతమొందించినట్లు పోలీసు విచారణలో తేలింది. నిందితులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసి, స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వివరాలను విలేకరులకు వెల్లడించారు. డోన్ మండలం కొచ్చెర్వు గ్రామానికి చెందిన లద్దగిరి శ్రీనివాసులు, జనార్దన్‌నాయుడులకు సుద్ద గనులు ఉన్నాయి. జనార్దన్‌నాయుడి గనికి సరైన రాయల్టీలు లేవని లద్దగిరి శ్రీనివాసులు సంబంధిత అధికారులకు చెప్పి జరిమానాలు వేయించడం, విజిలెన్స్ అధికారులకు సమాచారమిచ్చి టిప్పర్లను పట్టించి ఆర్థికంగా నష్టం కలిగించడం లాంటివి చేసేవాడు. ఈవిషయంలో ఏడాది క్రితం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. చంపుతానని ఫోన్ చేసి బెదిరిస్తున్నాడని శ్రీనివాసులు ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో జనార్దన్‌నాయుడు, అతడి బంధువులను పిలిపించి మందలించారు. ఇదంతా మనసులో పెట్టుకున్న జనార్దన్‌నాయుడు.. శ్రీనివాసులను చంపాలని నిర్ణయించుకుని ప్యాపిలి మండలం చంద్రపల్లి గ్రామానికి చెందిన పల్లె లక్ష్మన్నతో రూ.6 లక్షలకు ఒప్పందం చేసుకుని ముందుగా రూ.2 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. మిగిలిన డబ్బు హత్య చేసిన వారంలోపు ఇస్తానని మాట్లాడుకున్నారు. లక్ష్మన్న.. గుడిపాడు గ్రామానికి చెందిన సుగాలి రాము (అలియాస్ రాముడు), చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామానికి చెందిన హరిజన లాలప్ప, వడుల నెట్టికంటి, తాపెల నరసింహులు, నగరి శేఖర్‌ల సాయం తీసుకున్నాడు. వీరందరూ కలిసి ఈనెల 8న కొచ్చెర్వు గ్రామం నుంచి హుసేనాపురం గ్రామానికి బైక్‌పై వెళ్తున్న లద్దగిరి శ్రీనివాసులును బావిపల్లి వద్ద అడ్డుకుని రోకలి బండలతో మోది, పిడి బాకుతో పొడిచి హత్య చేసి పరారయ్యారు. హతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సోమవారం జనార్దన్‌నాయుడు, లక్ష్మన్న, రాములను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించడంతో నేరం ఒప్పుకున్నారు. వారిచ్చిన సమాచారంతో డోన్ పట్టణం సమీపంలోని రుద్రాక్ష గుట్ట వద్ద ఉన్న శేఖర్, లాలప్ప, నెట్టికంటి, నరసింహులులను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 6 సెల్ ఫోన్లు, రూ.57 వేల నగదు, పిడిబాకు, రెండు రోకలి బండలు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ప్యాపిలి సీఐ శ్రీరాములు, ఎస్‌ఐలు నరేష్, రాకేష్ పాల్గొన్నారు.

దారి దోపిడీ దొంగల అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు చైన్, కత్తులు

డోన్ రూరల్: పలు చోట్ల దారి దోపిడీలకు పాల్పడిన దొంగలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎర్రగుంట్ల గ్రామం వద్ద ఉన్న నగరవనం వద్ద సోమవారం అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్నారనే సమాచారం మేరకు బేతంచెర్ల సీఐ ప్రీతంరెడ్డి, రూరల్ ఎస్‌ఐ సరేష్, సిబ్బంది కలిసి దాడి చేశారు. ముగ్గురు పట్టుపడగా ఇద్దరు పరారయ్యారు. పట్టుబడిన నంద్యాల జిల్లా పాణ్యం చెంచుకాలనీకి చెందిన బాపట్ల సూరయ్య (అలియాస్ సూరి), మండ్ల శేఖర్, కమ్మగేరి శ్రీరాములును విచారించగా పలు నేరాలకు పాల్పడినట్లు తెలిసింది. వీరిపై పలు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వీరి వద్ద నుంచి మూడు కత్తులు, బంగారు నక్లెస్, ఒక జత కమ్మలు, చెవి చుట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ కేసులో పరారీలో ఉన్న గద్దల వీరయ్య, హరిచంద్రలను కూడా త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. వీరితో సంబంధం ఉన్న పాణ్యం మండలానికి చెందిన కొమగేరి వీరభద్ర అనే వ్యక్తిని కూడా అరెస్టు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దొంగలను రిమాండ్‌కు తరలించామన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

మంత్రాలయం రూరల్: విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి చెందాడు.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన వడ్ల తిప్పన్న కుమారుడు వడ్ల ఈశ్వర్(11) గ్రామంలోనే ఓ ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. ఉదయం పాఠశాలలకు వెళ్లేందుకు బ్యాగును తీసుకునే క్రమంలో పక్కనే ఉన్న కూలర్‌ను తాకాడు. అప్పటికే విద్యుత్ వైర్లు అర్త్ కావడంతో విద్యార్థి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లెదుటే కుమారుడు మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.





అరుణవర్ణ ప్రకాశమై!

సూర్యాస్తమయం.. సూర్యోదయం.. ఎన్నో జీవిత సత్యాలను బోధించడంతో పాటు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. రోజంతా ఉగ్రరూపం దాల్చిన సూరీడు సాయంత్రం కొండల్లో ఒదిగిపోతున్న దృశ్యం చూసేందుకు రెండు కళ్లూ చాలవు. మంగళవారం సాయంత్రం నగర శివారులోని టిడ్కో ఇళ్ల సమీపంలో సూర్యాస్తమయాన ఆకాశం అరుణవర్ణ శోభితమై కనువిందు చేసింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

కర్నూలు మార్కెట్‌కు పోటెత్తిన వాము

- వ్యాపారుల సిండికేట్‌తో నష్టపోతున్న రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు వాము పోటెత్తుతోంది. మార్కెట్‌కు రికార్డు స్థాయిలో 2,240 క్వింటాళ్ల వాము వచ్చింది. దేవనకొండ, ఆస్పరి, పత్తికొండ, ఓర్వకల్లు, సీ.బెళగల్, వెల్దుర్తి, కృష్ణగిరి తదితర మండలాల్లో వాము ఎక్కువగా పండిస్తారు. సుగంధ ద్రవ్యాలకు చెందిన వాముకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. వాము క్రయవిక్రయాలు జరిగే ఏకైక మార్కెట్ కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాత్రమే. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఈ–నామ్‌లో వాము కొనుగోళ్లు చేపడతారు. ఈ నెల 1 నుంచి మార్కెట్‌కు వాము ఎక్కువగా వస్తోంది. అయితే కర్నూలు మార్కెట్ యార్డులో వాము వ్యాపారులు సిండికేటై రైతులను దగా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాముకు డిమాండ్ ఉన్నా అంతంతమాత్రపు ధరలు వేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఒక్కటి లేదా రెండు చిన్న లాట్లకు రూ.20 వేలకు పైగా ధర నిర్ణయిస్తారు. మిగతా వాటికి తక్కువ ధర నిర్ణయిస్తున్నారు. ఈ సారి గరిష్ఠంగా వాము ధర రూ.26,666 వరకు పలికింది. మిగిలిన లాట్ల ధర రూ.13 వేలకు మించడం లేదు. నాణ్యతను బట్టి రూ.16 వేలు, రూ.18వేలు, రూ.20, రూ.22 వేలు ప్రకారం ధరలు లభించాల్సి ఉంది. ఈ నెల 9న వాముకు అత్యధికంగా 26,666 ధర లభించగా.. మోడల్ ధర కేవలం రూ.12,499 మాత్రమే. మంగళవారం గరిష్ఠ ధర రూ.24,590 కాగా...మోడల్ ధర రూ.11,440 మాత్రమే. ఇప్పటికైనా మార్కెట్ కమిటీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మార్కెట్‌కు వచ్చిన వాము నిల్వలు